బలగం
BALAGAM
TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం 21 మే 2025 | www.balagamtv.com | పేజీలు 4

## రోగులకు వైద్యులు చికిత్స చేస్తారు మేం ఉగ్రవాదానికి చేస్తున్నాం

- కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్


**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

వైద్యులు రోగులకు చికిత్స చేస్తారు, కానీ మేం రక్షణ మంత్రిత్వ శాఖలో ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో, ఉగ్రవాదం అనే వ్యాధికి నిర్మూలన చేస్తున్నామని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత సాయుధ దళాలు నైపుణ్యం కలిగిన సర్జన్లలా కచ్చితత్వంతో పనిచేశాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. సరిహద్దు వెంబడి ఉగ్రవాద మూలాలను కచ్చితత్వం, క్రమశిక్షణతో లక్ష్యంగా చేసుకున్నాయని చెప్పారు. ఈ మేరకు లఖ్‌నవూలోని కేఎస్ మెమోరియల్ హాస్పిటల్ 25వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, పలు వ్యాఖ్యలు చేశారు.

"పాకిస్థాన్ ఓటమిని అంగీకరించలేదు. భారత గడ్డపై ప్రతీకార దాడులకు ప్రయత్నించింది. పౌరులను, ప్రార్థనా స్థలాలు, దేవాలయాలు, గురుద్వారాలు, చర్చిలను లక్ష్యంగా చేసుకుంది. కానీ మన దళాలు తగిన సమాధానం ఇచ్చాయి. దాడుల సమయంలో భారత్ ఉగ్రవాద స్థావరాలను మట్టుబెట్టింది. పౌర ప్రాంతాలకు ఎటువంటి హాని జరగకుండా చూసుకోవడానికి జాగ్రత్తలు తీసుకుంది. నేరస్థులను

మిగితా 2వ పేజీలో

# దేశంలో మళ్లీ పెరుగుతున్న కరోనా కేసులు



- దేశంలో 257 యాక్టివ్ కేసులు
- మూడు రాష్ట్రాల్లో క్రమంగా పెరుగుతున్న కరోనా కేసుల సంఖ్య
- మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో పెరుగుతున్న కేసులు
- కేసులలో చాలావరకు అన్నీ తేలికపాటి లక్షణాలతో ఉన్నవే : అధికార వర్గాలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఆసియా దేశాలను వణికిస్తున్న కరోనా.. ఇప్పుడు భారత్‌లోకి పెరుగుతోంది. దేశంలో కేసుల సంఖ్యలో పెరుగుదల కనిపిస్తున్నది. ప్రస్తుతం దేశంలో 257 యాక్టివ్ కేసులు నమోదయ్యాయని అధికారులు వెల్లడించారు. పరిస్థితిని జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నామని వారు తెలిపారు. జలుబు, దగ్గుతో బాధపడుతున్న రోగులతోపాటు ఊపిరితిత్తుల వ్యాధులకు సంబంధించిన రోగుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని దవాఖానలను ఆదేశించినట్లు వారు చెప్పారు. ముంబైలోని కింగ్ ఎడ్వర్డ్ మెమోరియల్ దవాఖానలో గత వారం కొవిడ్ సోకినట్లు నిర్ధారణ అయిన రోగులలో ఓ మైనర్‌తోసహా ఇద్దరు వ్యక్తులు మరణించారు. ఈ రోగులకు దీర్ఘకాలిక రోగాలు కూడా ఉన్నాయని డాక్టర్లు తెలిపారు. ముఖ్యంగా మన దేశంలోని మూడు రాష్ట్రాల్లో కరోనా కేసుల సంఖ్య క్రమంగా పెరగటం ఆందోళన కలిగిస్తోంది. మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో కేసుల సంఖ్య మే నెలలో ఎక్కువగా నమోదు కావటం విశేషం.

కేరళ రాష్ట్రంలో కోవిడ్ కేసులు ఎక్కువ సంఖ్యలో పెరుగుతున్నాయి. కేరళ రాష్ట్రంలో మొత్తం 95 కోవిడ్ కేసులు నమోదు అవ్వగా.. వీరిలో 69 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఓ వ్యక్తి చనిపోయినట్లు కేరళ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రకటించింది. ఇందులో 27 మంది చికిత్స తర్వాత డిశ్చార్జ్ అయ్యారు.ఇక మహారాష్ట్రలో మొత్తం 44 కేసులు నమోదు అయ్యాయి. తమిళనాడు రాష్ట్రంలో 34 కోవిడ్ కేసులు నమోదు అయినట్లు అధికారికంగా ప్రకటించాయి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు.

నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్, ఎమర్జెన్సీ మెడికల్ రిలీఫ్ డివిజన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సెల్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్, కేంద్ర ప్రభుత్వ దవాఖానలకు చెందిన నిపుణులతో ఢిల్లీలో సమీక్షా సమావేశం జరిగింది. దేశంలో కొవిడ్-19 పరిస్థితి ప్రస్తుతం అదుపులో ఉందని సమావేశం నిర్ణయానికి వచ్చింది. ప్రస్తుతం దేశంలో 257 యాక్టివ్ కేసులు ఉన్నాయని, దేశ జనాభాను దృష్టిలో ఉంచుకుంటే ఇది చాలా తక్కువని అధికార వర్గాలు తెలిపాయి. ఈ కేసులలో చాలావరకు అన్నీ తేలికపాటి లక్షణాలతో ఉన్నవని, కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వారిని దవాఖానలో ఉంచి చికిత్స అందచేయవలసిన అవసరం లేదని వారు చెప్పారు.

### సింగపూర్, చైనా, థాయ్‌లాండ్‌లో పెరుగుదల

సింగపూర్, చైనా, థాయ్‌లాండ్‌లో కొవిడ్ పెరుగుదల తీవ్రంగా ఉంది. ఏప్రిల్ చివరి వారంలో 11వేల కేసులు సింగపూర్‌లో నమోదుకాగా, మే మొదటి వారానికి ఆ సంఖ్య 14,000 దాటింది. హాంకాంగ్‌లో మే మొదటివారంలో 1000కిపైగా కొత్త కేసులు నమోదుకాగా, 33 మంది ప్రాణాలు కోల్పోయారు. చైనాలోనూ కొవిడ్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయని, ఫ్లూ లక్షణాలతో దవాఖానల్లో చేరే వారి సంఖ్య సాధారణం కంటే రెట్టింపు ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఆసియా దేశాల్లో ప్రస్తుతం వైరస్ వ్యాప్తికి జేఎన్.1, దాని సబ్‌వేరియంట్‌లే కారణమని అధికారులు చెబుతున్నారు. జేఎన్.1 ఉపరకాలైన ఎల్ఎఫ్.7, ఎన్‌బీ.1.8 వేరియంట్‌ల వ్యాప్తి ఎక్కువగా ఉన్నదని సింగపూర్ తెలిపింది.



## సీఎంతో రష్యా కాన్సుల్ జనరల్ భేటీ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

చెన్నైలోని రష్యా కాన్సుల్ జనరల్ శ్రీ వలెరీ ఖుజ్కవ్ మంగళవారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన ఈ భేటీలో హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి జొన్నలగడ్డ స్నేహజతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఐఏఎస్‌లు గీత దాటొద్దు

- సీఎస్ రామకృష్ణారావు
- మెమో జారీ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఐఏఎస్‌లు గీత దాటొద్దని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం మెమో జారీ చేశారు. ప్రజా సమావేశాల్లో అనుచిత ప్రవర్తన మానుకోవాలని హితవు పలికారు. ఇటీవలి కాలంలో అఖిల భారత సర్వీసుల అధికారులు బహిరంగ సభలు, ఇతర సమావేశాల్లో సివిల్ సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా హావభావాలను ప్రదర్శిస్తున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. 1964 తెలంగాణ సివిల్ సర్వీస్ రూల్స్ (ప్రవర్తనా నియమావళి)కి మచ్చ తెచ్చే చర్యలు తగవని అన్నారు. ఇలాంటి ప్రవర్తనతో అధికారులపై ప్రజల్లో చులకన భావం ఏర్పడే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు



పునరావృతమైతే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాగర్‌కర్నూలు జిల్లా అధికారిక పర్యటనలో ఐఏఎస్ అధికారి శరత్ అత్యుత్సాహం ప్రదర్శిస్తూ కాళ్లు మొక్కిన నేపథ్యంలోనే సీఎస్ మెమో జారీ చేసినట్టు సమాచారం.

# కేసీఆర్‌కు నోటీసులు



- కాళేశ్వరం విచారణ కమిషన్ ఆదేశాలు
- మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఈటలకు కూడా..
- జూన్ 5న విచారణకు రావాలని కేసీఆర్‌కు ఆదేశాలు
- 6న హరీశ్‌రావు, 7న ఈటల...

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నోటీసులిచ్చింది. ఆయనతో పాటు మాజీ మంత్రి హరీశ్‌రావు, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌కూ నోటీసులను జారీ చేసింది. 15 రోజుల్లో కమిషన్ ఎదుట హాజరు కావాలని ఆ నోటీసులో పేర్కొంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో హరీశ్‌రావు నీటిపారుదల శాఖ మంత్రి, ఈటల రాజేందర్ ఆర్థిక మంత్రిగా పని చేశారు. ఈ నేపథ్యంలో వారిద్దరికీ కమిషన్ నోటీసులు జారీ చేసింది. కేసీఆర్ జూన్ 5న, హరీశ్‌రావు జూన్ 6న, ఈటల రాజేందర్‌ను జూన్ 9న విచారణకు హాజరు కావాలని పేర్కొంది. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన నేపథ్యంలో దీంతో పాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై విచారణ జరిపేందుకు న్యాయ విచారణ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో 2024 మార్చిలో ఏర్పాటైన ఈ కమిషన్ ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణ, డిజైన్, క్వాలిటీకంట్రోల్, పే అండ్ అకౌంట్స్, నీటిపారుదల, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు... ఇలా అందరినీ ఇప్పటికే విచారించింది.



## పెంచిన మెట్రో చార్జీలపై పది శాతం డిస్కౌంట్

- ప్రకటించిన ఎల్అండ్‌టీ మెట్రో రైల్ సంస్థ
- ఈనెల 24 నుంచి అమల్లోకి..

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఇటీవల పెంచిన మెట్రో రైలు చార్జీలపై 10శాతం డిస్కౌంట్ ఎల్అండ్‌టీ మెట్రో రైల్ సంస్థ ప్రకటించింది. మూడు మెట్రో కారిడార్లలోని అన్నిజోన్లలో కొత్తగా సవరించిన చార్జీలపై ఈ డిస్కౌంట్ వర్తించనుంది. ఈ డిస్కౌంట్ చార్జీలు ఈనెల 24 నుంచి అమల్లోకి రానున్నాయని ఆ సంస్థ వెల్లడించింది. ఫేర్ ఫిక్సేషన్ కమిటీ(ఎఫ్ఎఫ్‌సీ) సిఫార్సుల మేరకే చార్జీలను పెంచినట్టు తెలిపింది. ఈ మేరకు ఎల్అండ్‌టీఎంఆర్‌హెచ్ఎల్ సీఎండీ కేవీబీ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. దీర్ఘకాలంలో మెట్రో కార్యకలాపాలను సుస్థిరంగా నిర్వహించుకోగలిగేందుకు ఉద్దేశించిన సమగ్ర వ్యూహంలో భాగంగా చార్జీలు సవరించినట్టు తెలిపారు. ఆర్థికంగా దూరదృష్టితో వ్యవహరిస్తూ, ప్రయాణికులకు అందు బాటు స్థాయిలో సేవలు అందించాలన్న సంస్థ నిబద్ధతను దృష్టిలో ఉంచుకుని, ప్రయాణికుల అభిప్రాయాలను పరిగణన లోకి తీసుకుని సంస్థ ఈ నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు.

బాధ్యతాయుతమైన పట్టణ ప్రాంత ట్రాన్సిట్ ఆపరేటర్‌గా.. నగరవాసులకు సమర్థవంతమైన అందుబాటు స్థాయిలో మొబిలిటీ సొల్యూషన్స్‌ను అందించేందుకు ఎల్అండ్‌టీఎంఆర్‌హెచ్ఎల్ కట్టుబడి ఉందని చెప్పారు. మెట్రో కార్యకలాపాలను నిలకడగా కొనసాగించేందుకు చార్జీలను సవరించక తప్పలేదనీ, అయినప్పటికీ తమ అమూల్యమైన ప్రయాణికులపై

మిగితా 2వ పేజీలో

## భూ సమస్యల పరిష్కారానికి రైతులు ఒక్క రూపాయి చెల్లించాల్సిన అవసరం లేదు




- భూభారతి రైతులకు అంకితం
- జూన్ 2 నుంచి చట్టం అమలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

భూ సమస్యల పరిష్కారానికి రైతులు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు.. దరఖాస్తు కూడా ఉచితమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంచిర్యాల,పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల్లోని భూభారతి పైలెట్ మండలాలుగా ఎంపికైన భీమారం, ఎలిగేడు, సైదాపూర్ మండలాలోని పలు గ్రామాలలో నిర్వహించిన భూభారతి అవగాహన కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా హజరయ్యారు. సహచర మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులతో కలిసి పాల్గొన్నారు.

మంత్రి మాట్లాడుతూ "జూన్ 2 నుంచి తహసిల్దార్ స్థాయి అధికారులు మండల పరిధిలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారాలపై చర్యలు తీసుకుంటారు. దీనికోసం రైతులు ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు, దరఖాస్తు కూడా ఉచితంగా అందిస్తారు. రైతులు ఈ సదావకాశాన్నివినియోగించుకోవాలి. గత ప్రభుత్వం 2020లో ధరణి చట్టం తెచ్చినప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా 9 లక్షల 20వేల పైచిలుకు భూ సమస్యలు ఉన్నాయి. వాటికి ఎలాంటి పరిష్కారం చూపించలేదు.భూ సమస్యల పరిష్కారం కోసం మొదటి విడతలో 6000 మంది సర్వేయర్ల కు మూడు నెలల పాటు శిక్షణ ఇస్తున్నాం. మండలానికి 6 నుండి 8 మంది సర్వేయర్లు పనిచేస్తారు.

రాష్ట్రంలో అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలన్నింటికీ ఈ భూభారతితో తప్పకుండా శాశ్వత పరిష్కారం లభించేలా మన ప్రభుత్వం కృషి చేస్తుంది. జూన్ 2 నుండి 10956 గ్రామాల్లో రెవిన్యూ అధికారులు విధులు నిర్వహిస్తారు. అన్యాక్రాంత భూములను స్వాధీనం చేసుకొని పేదలకు కేటాయిస్తాము. వీటితోపాటు సంక్షేమంలో కూడా రాజీలేకుండా కార్యక్రమాలు చేపడుతున్నాం, రాష్ట్రంలో పేదలకు 20 లక్షల ఇండ్లు కట్టించాలన్నదే మన ప్రజా ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నది" అని తెలిపారు.

## త్వరలో ఆర్టీసీలో కొత్త నియామకాలు

- ప్రజల అభీష్టం మేరకు ముంబై కు లహరి ఏసీ స్లీపర్ బస్సు సర్వీసు..
- రాష్ట్ర బీసి, రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



మహా లక్ష్మి పథకం పథకం విజయవంతం కావడానికి కష్టపడుతున్న ఆర్టీసీ డ్రైవర్ లు ,కండక్టర్ కు ,సిబ్బంది సంక్షేమానికి కట్టుబడుతూనే,సంస్థ అభివృద్ధి దిశగా పని చేస్తున్నామని, త్వరలో ఆర్టీసీ లో కొత్త నియామకాలు ,కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నామని రాష్ట్ర బీసి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం వేములవాడ చెరువు కట్ట గుడి ప్రాంగణం వద్ద వేములవాడ నుంచి ముంబై కి రెండు ఏసీ బస్సులను రాష్ట్ర బీసి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝ లతో కలిసి పూజ నిర్వహించి,జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర బీసి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజల అభీష్టం మేరకు మే 20 నుంచి వేములవాడ నుండి ముంబై వెళ్ళేందుకు ఏసీ స్లిపర్ బస్సు లహరి సర్వీసులను ప్రారంభిస్తున్నామని అన్నారు. 2 లహరి సర్వీస్ ఏసీ బస్సులను ముంబై సర్వీస్ నిమిత్తం కేటాయించడం జరిగిందని అన్నారు.ప్రతి రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు వేములవాడ నుండి బయలు దేరి తెల్లారి ఉదయం 4.45 గంటలకు ముంబై కు చేరుకుంటుందని, అదే రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు ముంబై నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు వేములవాడ చేరుకుంటుందని, ప్రతిరోజు ముంబై నగరానికి అప్ అండ్ డౌన్ సర్వీస్ నడుస్తుందని అన్నారు.

లహరి బస్సు సర్వీస్ లో 22 సీట్స్, 20 స్లిపర్ బెర్త్ లు ఉన్నాయని, ప్రతి సీటుకు చార్జింగ్ పాయింట్, ఏసి అడ్జెస్ట్ మెంట్ సౌకర్యం ఉందని, వైఫై సౌకర్యం బస్సులో కల్పించామని, సిసి కేమేరాలు ఉన్నాయని అన్నారు. వేములవాడ నుంచి ముంబైకు పెద్దలకు స్లీపర్ బెర్త్ కు 2 వేల రూపాయలు, సీటు 1500 రూపాయలకు, పిల్లలకు బెర్త్ 1600, సీట్ 1230 రూపాయలకు టికెట్ ఉంటుందని , పట్టణ వాసులు ఈ సర్వీసు ను వినియోగించుకోవాలనిఅన్నారు. ముంబై లో ఉన్న తెలంగాణ బిడ్డల ప్రయాణంకి ఇబ్బంది కలగవద్దని అక్కడి ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు బస్సు ప్రారంభం చేసుకున్నామనీ,ఈ బస్సు నిర్ణయాన్ని ముఖ్యమంత్రి ప్రశంసించారనీ,రాబోయే కాలంలో జిల్లా కేంద్రం నుండి హైదరాబాద్ కి ప్రతి పుణ్యక్షేత్రం

మిగితా 2వ పేజీలో

## రాజ్‌భవన్‌లో హార్డ్ డిస్క్ చోరీ.. నిందితుడు అరెస్ట్

**బలగం టీవీ, హైదరాబాద్**

అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే రాజ్‌భవన్‌లో చోరీ జరిగింది. రాజ్‌భవన్ సుధర్మ భవన్‌లో నాలుగు హార్డ్ డిస్కులు మాయమయ్యాయి. ఈ నెల 13న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హార్డ్ డిస్కులు చోరీ గురైనట్లు గుర్తించిన రాజ్‌భవన్ సిబ్బంది పంజాగుట్టా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. శ్రీనివాస్ అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పూర్తి వివరాల్లోకెళ్తే.. రాజ్‌భవన్‌లో ఔట్ సోర్సింగ్ పద్దతిలో టి.శ్రీనివాస్ అనే వ్యక్తి హార్డ్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల అతను ఓ మహిళా ఉద్యోగిని ఫొటోలను అసభ్యకరంగా మార్ఫింగ్ చేశారని ఆరోపణలు రావడంతో అధికారులు పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో విచారణ చేపట్టిన పోలీసులు శ్రీనివాస్‌ను ఈ నెల 12న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శాఖాపరమైన చర్యల్లో భాగంగా అతన్ని విధుల్లో నుంచి కూడా రాజ్‌భవన్ అధికారులు సస్పెండ్ చేశారు. అయితే రెండు రోజుల్లోనే శ్రీనివాస్ బెయిల్‌పై బయటకు వచ్చాడు.

ఇదిలా ఉండగా ఇటీవల రాజ్ భవన్ ప్రాంగణంలోని సుదర్శన భవన్‌లో హార్డ్ డిస్క్ మాయమైంది. ఈ వ్యవహారంపై ఈ నెల 14న రాజ్‌భవన్ ఐటీ మేనేజర్ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించగా ఓ వ్యక్తి హెల్మెట్ ధరించి కంప్యూటర్ రూంలోకి ప్రవేశించినట్టు గుర్తించారు. ఈ క్రమంలోనే పోలీసులు ప్రాథమిక విచారణలో భాగంగా రాజ్ భవన్‌లో పనిచేసి మార్ఫింగ్ కేసులో అరెస్టయిన శ్రీనివాస్‌ను అదుపులోకి

మిగితా 2వ పేజీలో

## ప్రాణపాయస్థితిలో బలగం సినిమా నటుడు జీవి బాబు

- కిడ్నీలు ఫెయిలై వరంగల్ ఆస్పత్రిలో ధీనస్థితిలో
- చేతిలో చిల్లిగవ్వ లేక.. ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్లాడుతున్న జీవి బాబు
- బలగం డైరక్టర్ వేణు యెల్దండి, హీరో ప్రియదర్శి ఆర్థిక సాయం
- వరంగల్ సంరక్ష హాస్పిటల్ వెళ్లి వచ్చిన బలగం చిత్రబృందం
- జీవి బాబు కుటుంబ సభ్యులతో ఫోన్లో మాట్లాడి ధైర్యం చెప్పిన డైరక్టర్ వేణు

**బలగం టీవీ, వరంగల్**

కమెడియన్ వేణు డైరక్టర్ గా తీసిన మొదటి సినిమా బలగం ఎంత సూపర్ డూపర్ హిట్ అయ్యింది తెలుగు,



తెలంగాణా ప్రజానీకానికి తెలిసిందే. ఈ సినిమాలో నటించిన బలగం మొగిలయ్య కిడ్నీలు ఫెయిలై.. మరణించిన విషయం విదితమే. ఈ సంఘటన మరవక ముందే బలగం లో హీరో ప్రియదర్శి తాతగా నటించిన జీవి బాబు సైతం అనారోగ్యానికి గురై ఆస్పత్రి పాలయ్యారు. కిడ్నీలు ఫెయిలై వరంగల్ జిల్లా కేంద్రంలోని సంరక్ష ఆసుపత్రి లో డయాలసిస్ పొందుతున్నాడు. జీవి బాబు తీవ్ర అస్వస్థకు గురై మాట బంద్ అయ్యింది. జీవి బాబు ఆర్థిక పరిస్థితి బాగులేకపోవడం చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో పలు పత్రికలు, టీవీ ఛానెళ్లు జీవి బాబు వార్తాను ప్రసారం చేశాయి. విషయం తెలుసుకున్న బలగం డైరక్టర్ వేణు యెల్దండి, హీరో ప్రియదర్శి ఆర్థిక సాయం చేయడానికి ముందుకు వచ్చారు.

మిగితా 2వ పేజీలో

# ప్రతి సంక్షేమ పథకం పేదవాడికి అందేలాగా కృషి..

**-క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతం చేస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలి**

**-బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

**బలగం టీవీ, వేములవాడ**



గత పాలకులు రాష్ట్రాన్నిఆర్థికంగా చిన్నాభిన్నం చేసిపోయారు,కొంత ఇబ్బంది ఉంది, అయినా ప్రతి సంక్షేమ పథకం పేదవాడికి అందేలాగా కృషి చేస్తున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.వేములవాడ హరిహర గార్డెన్ లో వేములవాడ నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ సమావేశం నిర్వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై మాట్లాడుతూ ఎవరైతే గ్రామ కాంగ్రెస్ పార్టీని నడపగలుగుతారో వారిని గ్రామ అధ్యక్షుడు గా ఎన్నుకోవాలని, మండల అధ్యక్షు లు గా సమష్టిగా నిర్ణయం తీసుకోవాలని అన్నారు.మీ అందరి కృషి శ్రమ తో తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని అన్నారు. గతంలో అమలవుతున్న కార్యక్రమాలు తీసేయ కుండా కొనసాగిస్తూనే,200 యూనిట్ల ఉచిత విద్యుత్,500 కి గ్యాస్,సన్న వడ్ల కి 500 బోనస్,సన్న బియ్యం పంపిణీ,రైతులకు 2 లక్షల రూపాయలు రుణమాఫీ ,ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాలు అమలు చేస్తున్నామని అన్నారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు ప్రతి ఇంటికి తీసుకుపోయి అన్ని ఎన్నికల్లో పార్టీ గెలిచేలా బాధ్యత కార్యకర్తలుదే అని అన్నారు. గ్రామ,మండల ,జిల్లా కాంగ్రెస్ నేతలు పార్టీ అధికారంలోకి రావడానికి ఎలా కష్టపడ్డారో ఇప్పుడు కూడా క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యక్రమాలు తీసుకుపోవాలని అన్నారు.సాగు నీటి పథకాలు కలికోట సూరమ్మ, అప్పర్ మానేరు పనులు పూర్తి చేస్తున్నామని అన్నారు.శ్రీ వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆశీర్వాదంతో ఆలయం అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారని, సోలార్ ద్వారా మోటార్ సిస్టమ్ అమలు చేస్తున్నామని అన్నారు.

రాజీవ్ యువ వికాసం స్వయం ఉపాధి పొందడం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు.హుస్నాబాద్ నియోజక వర్గంలో 1200 డబుల్ బెడ్ రూం ఇల్లు సాంక్షన్ చేస్తే,200 ఇల్లు కూడా నిర్మించలేదని, 230 ఇల్లు ములకనూరు మాజీ సీఎం దత్తత తీసుకున్న గ్రామంలోనే ఉన్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క నియోజకవర్గం లోనే ఒక సంవత్సరంలోనే 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాం అని అన్నారు.

పేదలల్లో పేదలకు పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామని,ప్రతిదీ రాజకీయం చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతం చేస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలని,మన ప్రభుత్వం ఇచ్చిన మాట అమలు చేస్తుందని అన్నారు. వేములవాడ ఆలయ అభివృద్ధి లో శృంగేరి పీఠాధిపతి చెప్పిన సలహా మేరకే అభివృద్ధి జరుగుతుందని, ఇందులో వ్యక్తిగత రాజకీయ అవకాశాలు లేవు అని అన్నారు.

వేములవాడ ఆలయ అభివృద్ధి లో వ్యాపారాలు ఇబ్బందులు పెట్టాలని మాకు లేదు,పూజ కార్యక్రమాలకు ఇబ్బందులు లేవు అని అన్నారు. భక్తుల మనోభావాలు మేరకే ఆలయ అభివృద్ధి జరుగుతుందని,దీన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి అని అన్నారు. మండలాలు గ్రామాల్లో పార్టీ పునఃనిర్మాణం జరగాలని,అనుబంధ సంఘాలు , యువజన సంఘాలు బలోపేతం కావాలని అన్నారు. సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, పీసీసీ పరిశీలకులు పక్రుద్దీన్ ,కృష్ణా రెడ్డి,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మండల ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు,మార్కెట్ కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.



## తెలంగాణ జర్నలిస్టుల ఫోరం
# రజతోత్సవ జాతరను జయప్రదం చేద్దాం

**-రజతోత్సవ పోస్టర్ ను ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**హైదరాబాద్ జలవిహార్ రజతోత్సవ సభకు తరలిరావాలి**

**టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా**

**బలగం టీవీ, వేములవాడ**

తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రజతోత్సవ సంబరాల పోస్టర్ ను రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్న ప్రభాకర్, వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు.తెలంగాణ జర్నలిస్టు ఫోరం రజతోత్సవ సభ కు జర్నలిస్టు సమాజం పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయా లని టీయూడబ్ల్యూజె రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు లాయక్ పాషా పిలుపునిచ్చారు. టీజెఎఫ్ ఆవి ర్భావ దినోత్సవం ఈనెల 31 న 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హైదరాబాద్ జలవిహార్ లో నిర్వహించే రజతోత్సవ సభకు జిల్లా నుండి జర్నలిస్ట్ సోదరులు పెద్ద ఎత్తున కదలి రావాలని విజ్ఞప్తి చేశారు. 2001 మే నెలలో తె లంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమమే ఊపిరిగా టీజెఎఫ్ ఆవిర్భించిందని అన్నారు. . ఆనాడు ప్రత్యేక రాష్ట్ర ఉ ద్యమంలో ముందు వరుసలో నిల బడి రాష్ట్ర సాధించడంలో కీలక భూమిక పోషించిందన్నారు. టీజెఎ ఫ్ఏర్పడి 25 సంవత్సరాలు , పూర్తి అవుతున్న సందర్భంగా హైదరా బాద్ లోని జలవిహార్ లో 'జర్నలిస్ట్ ల జాతర 'ను నిర్వహిస్తున్నారని, ఈ జాతరకు అన్నీ రాజకీయ పార్టీ ల ముఖ్యులు హాజరవుతారన్నారు. హైదరాబాదులోని జలవిహార్ లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రవితోత్సవ సభను విజయవంతం చేయాలన్నారు. ఈ జాతరకు జిల్లా లోని అన్ని మండలాల నుంచి జర్న లిస్టు సోదరులు హాజరుకావాలని కోరారు. టీయూడబ్ల్యూజే 143 రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ అధ్యక్షతన రజతోత్సవ సభను ని ర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టెంజు జిల్లా అధ్యక్షులు ఇరుకుల ప్రవీణ్ కుమార్, టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి సామల్ల గట్టు, వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మహమ్మద్ రఫీ, యూనియన్ సీనియర్ ప్రతినిధులు గర్దాసు ప్రసాద్, పరకాల ప్రవీణ్, టీ న్యూస్ ప్రసాద్, తంగళ్ళపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు శ్రీనివాస్ తో పాటు పెద్ద సంఖ్యలో జర్నలిస్టు సోదరులు పాల్గొన్నారు.

# రోగులకు వైద్యులు చికిత్స చేస్తారు మేం ఉగ్రవాదానికి చేస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

శిక్షించేటప్పుడు, అమాయకుల ప్రాణాలకు ఎటువంటి హాని జరగకుండా మన సైనికులు చూసుకున్నారు" అని తెలిపారు. గత నెలలో ఈ కార్యక్రమానికి ఆహ్వానాన్ని అంగీకరించినప్పుడు, ఇటీవల నెలకొన్న ఉద్రిక్తతల పరిస్థితి కారణంగా తాను హాజరు కాగలనా లేదా అని అనుకున్నట్లు రాజ్?నాథ్ తెలిపారు. కానీ ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా ముగిసిన తర్వాత సాయుధ దళాలకు, ప్రజల స్ఫూర్తికి కృతజ్ఞతలు తెలియజేయడానికి వచ్చానని తెలిపారు. "మీరు (వైద్యులు) రోగులకు చికిత్స చేస్తారు, కానీ మేం రక్షణ మంత్రిత్వ శాఖలో ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో, ఉగ్రవాదం అనే వ్యాధికి నిర్మూలన చేస్తున్నాం. ఆపరేషన్ సిందూర్ విజయం ఆ సంకల్పానికి నిదర్శనం" అని ఆయన అన్నారు.

# పెంచిన మెట్రో చార్జీలపై పది శాతం డిస్కౌంట్

(మొదటి పేజీ తరువాయి)

ఆర్థిక భారం పడనివ్వకుండా చూడాలనే అంశానికి తాము అత్యంత ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. ఇందులో భాగంగానే ప్రయాణికుల ఫీడ్‌బ్యాక్, వారి వెసులుబాటు మేరకు కొత్తగా సవరించిన చార్జీలపై పది శాతం డిస్కౌంట్ ఇవ్వాలనే నిర్ణయం తీసుకున్నామనీ, అందుబాటు చార్జీల్లో రోజువారీ ప్రయాణాలకు వీలు కల్పించాలన్న తమ చిత్తశుద్ధికి ఇది నిదర్శనంగా నిలుస్తుందని కేవీబీ రెడ్డి వివరించారు. ఈనెల 24 నుంచి మూడు మెట్రో కారిడార్లలోని అన్ని జోన్‌లో పెంచిన చార్జిలపై ఈ డిస్కౌంట్ అమల్లోకి వస్తుందని, మద్దతుగా నిలుస్తున్న ప్రయాణికులకు కృతజ్ఞతలు చెప్పారు. ప్రయాణికులకు విశ్వసనీయమైన, అనువైన మెట్రో అనుభూతిని అందించేందుకు తాము కట్టుబడి ఉన్నట్టు హామీస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ వాసులకు సురక్షితమైన, విశ్వసనీయమైన అందుబాటు స్థాయిలో మెట్రో సేవలు అందించాలనే లక్ష్యానికి ఎల్‌అండ్‌టీఎంఆర్‌హెచ్‌ఎల్ కట్టుబడి ఉందని, సవరించిన చార్జిలు, ఇతర అప్‌డేట్‌ల కోసం సమగ్ర సమాచారం కోసం ప్రయాణికులు తమ అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎల్‌టీమెట్రో.కామ్‌ను సందర్శించగలరని ఆయన విజ్ఞప్తి చేశారు. కాగా ఇటీవల ఎల్‌అండ్‌టీ మెట్రో సంస్థ కనీస చార్జి రూ.10 నుంచి 12కు, గరిష్ట చార్జి రూ.60 నుంచి 75కు పెంచిన విషయం తెలిసిందే.

# ప్రాణపాయస్థితిలో బలగం సినిమా నటుడు జీవి బాబు

(మొదటి పేజీ తరువాయి)

బలగం చిత్రబృంద సభ్యుడు, డైరెక్టర్ వేణు మిత్రుడు బాలు కాయితి సిరిసిల్ల తో తాత్కాలిక సాయాన్ని వరంగల్ కు పంపించారు. జీవి బాబు ను ఆస్పత్రిలో పరామర్శించి.. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు, ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడారు. ప్రస్తుతం ఆరోగ్య శ్రీ లో డయాలాసిస్ పక్రియ నడుస్తుంది. తాత్కాలికంగా సాయం అందించారు. విషయం ప్రొడ్యూసర్ దిల్ రాజు దృష్టికి తీసుకెళ్ల నున్నారు.అలాగే బలగం చిత్రం లో నటించిన పలువురు నటినటులు తమకు తోచిన సాయాన్ని అందించారు. జీవి బాబు కుటుంబానికి అండగా ఉంటామని ప్రకటించారు. డైరక్టర్ వేణు యెల్దండి జీవి బాబు కుటుంబ సభ్యులతో ఫోన్లో మాట్లాడి పరామర్శించారు. ఎల్లమ్మ సినిమా కు సంబంధించి కాస్తా బీజీగా ఉన్నానని, ప్రస్తుతం అందుబాటులో లేకపోవడంతో రాలేకపోయానని పేర్కొన్నారు. అందుకే బలగం చిత్ర బృందం నుంచి బాలు కాయితి ని పంపించడం జరిగిందన్నారు. ప్రభుత్వం నుంచి ఉచిత వైద్యం అందేలా మాట్లాడుతామని వేణు యెల్ధండి పేర్కొన్నారు.

# త్వరలో ఆర్టీసీలో కొత్త నియామకాలు

(మొదటి పేజీ తరువాయి)

నుండి బస్సులు వేసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయనీ అన్నారు. అంతకుముందు మంత్రి వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో రాజన్న స్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బస్సు ప్రారంభించిన అనంతరం ఆలయ ప్రాంగణం నుండి వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ వరకు అదే బస్సులో ప్రయాణించీ ముంబై వెళ్ళే ప్రయాణికులకు, పట్టణ ప్రజలకు స్థానిక ప్రజలకు ముంబై లో ఉన్న తెలుగు వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎస్పి మహేష్ బి.గీతే, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, ప్రజా ప్రతినిధులు , ఆర్టీసీ రీజనల్ మేనేజర్లు డిపో మేనేజర్లు,ప్రజలు, ప్రయాణికులు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాజ్‌భవన్‌లో హార్డ్ డిస్క్ చోరీ.. నిందితుడు అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుని విచారించారు. ఈ మేరకు దొంగతనం చేసినట్టు తేలడంతో అతని నుంచి హార్డ్ డిస్క్‌ను రికవరీ చేసి రిమాండ్‌కు తరలించారు. ఫోటోల మార్ఫింగ్ విషయంలో తన తప్పును కప్పిపుచ్చుకునే క్రమంలో ఏకంగా హార్డ్ డిస్క్‌నే నిందితుడు దొంగిలించినట్టు తెలుస్తోంది.

# వాల్టాపై స్పెషల్‌డ్రైవ్.. పల్లెలు, పట్టణాల్లో విస్తృత ప్రచారం

**- రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క**

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రవ్యాప్తంగా వాల్టా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. వారంపాటు స్పెషల్ డ్రైవ్ చేపట్టి పల్లెలు, పట్టణాల్లో విస్తృత ప్రచారం చేపడతామని తెలిపారు.మంగళవారం సెక్రటేరియట్‌లో సీతక్క అధ్యక్షతన వాల్టా అథారిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూగర్భ జలాల పరిరక్షణ, మొక్కల పెంపకం, పర్యావరణాన్ని కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో భూగర్భ జలాల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. దీనికి ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# దివ్యాంగులకు గుడ్ న్యూస్..

**బలగం టీవీ, హైదరాబాద్**

దివ్యాంగులకు వివాహప్రోత్సాహక సహాయంపై తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఇప్పటివరకు, వివాహిత జంటలో ఒకరు వికలాంగులైతేనే ప్రభుత్వం వివాహ ప్రోత్సాహక పథకం కింద రూ.లక్ష ఆర్థిక సహాయం అందించేది. అయితే, ఈ సందర్భంలో పథకం నియమ నిబంధనలను సమీక్షించిన మంత్రి సీతక్క వికలాంగుల వివాహ ప్రోత్సాహక పథకం మార్గదర్శకాలను మార్చాలని నిర్ణయించారు. ఇద్దరు దివ్యాంగులు వివాహం చేసుకున్నా కూడా.. వివాహ ప్రోత్సహిం ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు.

# మల్బరీ సాగుకు చర్యలు తీసుకోవాలి

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ**

**బలగం టీవీ,గంభీరావుపేట**



మల్బరీ సాగుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఆదేశించారు. మంగళవారం గంభీరావుపేట మండలం కోళ్లమద్ది గ్రామంలోని పట్టు పురుగుల పెంపకం కేంద్రంలోని ఆవరణ, మొక్కలు, బిల్డింగ్ మొత్తం ను కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ మాట్లాడుతూ కోళ్లమద్ది గ్రామంలోని పట్టు పురుగుల పెంపకం కేంద్రం వినియోగంలోకి వచ్చేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని, ప్రభు త్వ భూమి మరియు చెట్లు అన్యాక్రాంతం కాకుండా చూడాలని అన్నారు. ముందుగా నీటి సౌకర్యం కోసం బోర్ వేయించాలని పేర్కొన్నారు. పట్టు పురుగుల పెంపకం కోసం సన్నద్ధం కావాలని, రైతులకు ఉపయోగపడేలా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి లత, అధికారులు లోకేష్, జగన్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెరుగైన బోధనకు పటిష్ట కార్యాచరణ




**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**

**బలగం టీవీ, సిరిసిల్ల**

ప్రభుత్వ పాఠశాలల్లో చదివేందుకు వచ్చే విద్యార్థులకు మెరుగైన అందించేందుకు పటిష్ట కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని గీత నగర్ లోని ప్రభుత్వ పాఠశాల లో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న 5 రోజుల వేసవి శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ పిల్లలు గణితం, ఏఐ టూల్స్ లో వెనుక పడకుండా వినూత్న పద్ధతులలో వారికి అర్థమయ్యేలా బోధన సాగించాలని అన్నారు. నూతన బోధన పద్ధతులు, పిల్లలకు బోధించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు రెగ్యులర్ గా పాఠశాలకు హాజరయ్యే విధంగా ఉపాధ్యాయులు ఫాలో అప్ చేయాలని అన్నారు. పిల్లల గణిత పరిజ్ఞానం పై అధిక దృష్టి సారించాలని, వెనుకబడిన విద్యార్థుల పై స్పెషల్ ఫోకస్ పెట్టాలని అన్నారు. పిల్లలతో గణితం లోని వివిధ కాన్సెప్ట్ ల పై ఎక్కువ ప్రశ్నలు అభ్యాసన చేయించాలని, వివిధ సమస్యలను ఎలా సాల్వ్ చేయాలో విద్యార్థులు స్వయంగా ప్రయత్నించేలా ప్రోత్సహించాలని అన్నారు.

పదవ తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించినప్పటికీ విద్యార్థులు ఇంటర్లో అధికంగా వైఫల్యం చెందుతున్నారని, విషయ పరిజ్ఞానంలో ముందస్తు నుంచి విద్యార్థులను బలోపేతం చేస్తే వైఫల్యాలను నిరోధించవచ్చని తెలిపారు. హిస్టరీ, సివిక్స్, రాజ్యాంగం లో ముఖ్యమైన ఆర్టికల్స్, జియోగ్రఫి, ఎక్నామిక్స్ సబ్జెక్టులో ముఖ్యమైన అంశాలను విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేం దుకు పాటించాల్సిన బోధన పద్ధతుల పై పలు సూచనలు చేశారు.

విద్యా శాఖలో ఒకే రోజు మార్పు సాధ్యం కాదని, నిర్విరామంగా ప్రయత్నం జరుగుతూ ఉండాలని అన్నారు.టీచర్ వృత్తి లో మనం కొనసాగడానికి ఒకే కారణం ప్రభుత్వ పాఠశాల లకు వచ్చే పిల్లలు మాత్రమేనని,నిరుపేద రైతులు, కూలీలు, బడుగు బలహీన వర్గాల కుటుంబాల నుంచి వచ్చిన పిల్లల జీవితాలను బాగు చేసే అవకాశం మనకు లభించిందని అన్నారు. సమాజంలో మంచి పునాది ఉండాలంటే ఉపాధ్యాయులు కీలకమని, మంచి విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధనరావు, సంబంధిత విద్యా శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

**బలగం టీవీ, వేములవాడ**



పెద్ద హనుమాన్ జయంతిని పురస్కరించుకొని వేములవాడలో హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో శోభాయాత్ర కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హనుమాన్ దీక్షదారులతోపాటు భక్తులు జై శ్రీరామ్ నినాదాలు చేస్తూ, నృత్యాలతో వేములవాడ పట్టణంలోని అన్ని పురవీధుల గుండా భక్తి శ్రద్ధలతో శోభాయాత్ర చేపట్టారు. స్వాములకు వీధి వీధినా మహిళలు భక్తులు మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలకడం తో పాటు అభిషేకాలు నిర్వహించారు. శోభాయాత్ర కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ , మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి రాజు, బిజెపి నాయకులు ప్రతాప రామకృష్ణ, మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు ,టౌన్ సిఐ వీరప్రసాద్ తదితరులు పూజలు నిర్వహించి శోభాయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంతో భక్తి శ్రద్ధలతో దీక్షగా హనుమాన్ మాల ధరించిన స్వాములు హిందూ ధర్మాన్ని కాపాడుతూ హనుమాన్ జయంతి వరకు మాల ధారణతో పూజలు నిర్వహించడం వారి భక్తిశ్రద్ధలకు నిదర్శనం అని పేర్కొన్నారు. ధైర్యానికి ,బలానికి, ధీరత్వానికి నిదర్శనంగా పూజించే దైవం శ్రీ ఆంజనేయ స్వామి వారి కృపాకటాక్షాలు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అన్న ప్రసాద వితరణ కార్యక్రమానికి సహకరించిన దాత ఆది కార్తీక్ కు హనుమాన్ సేవా సమితి ప్రతినిధి మొట్టల మహేష్ తో పాటు స్వాములు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. శోభాయాత్ర కార్యక్రమానికి నేతలు నామాల లక్ష్మీరాజం, ఇప్పపూల అజయ్, అన్నారం శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులతో పాటు హనుమాన్ సేవా సమితి సభ్యులు సనుగుల సత్యం, బోనాల శివ ,కొలకాని హరీష్, మాకాశి ప్రసాద్ ,విజయ్, సాయి, ప్రసాద్ ,నాని, ధనుంజయ్ ,కుమ్మరి మారుతి తో పాటు పెద్ద ఎత్తున దీక్షదారులు పాల్గొన్నారు.






# పేదల సొంతింటి కలను ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తుంది..

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**



పేదల సొంతింటి కలను ప్రజా ప్రభుత్వం నెర వేరుస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం చందుర్తి మండలం లో రెండో విడత క్రింద 503 ఇందిరమ్మ ఇండ్ల మంజూరి ఉత్తర్వులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తో కలిసి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేదలకు ఇచ్చిన మాట ప్రకారం సోంత స్థలం ఉన్న నిరు పేదలను గుర్తించి మొదటి విడత లో చందుర్తి మండలంలో 503 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేయడం సంతోషంగా ఉందని అన్నారు. గత పాలకులు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో పేదలను వంచనకు గురి చేశారని అన్నారు. గత ప్రభుత్వం సృష్టించిన ఆర్థిక విధ్వంసాన్ని సరిచేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల వ్యవధిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు, మహిళలకు ఆర్టిసి బస్సులో ఉచిత బస్సు ప్రయాణం పథకాలను ప్రారంభించామని అన్నారు.

పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయల గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నామని, రైతులకు 2 లక్షల వరకు పంట రుణ మాఫీ, సన్న వడ్లకు క్వింటాళ్ల 500 బోనస్, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రెసిడెన్షియల్ పాఠశాలలో 40% డైట్ చార్జీలు, 200 శాతం కాస్మోటిక్ చార్జీల పెంపు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం వంటి అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల చేపట్టామని అన్నారు.

గతంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు తాళ్ళ కోతలు ఉండేవని, నేడు ఎక్కడా కోతలు లేకుండా పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తున్నామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద లబ్ధిదారులకు 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామని అన్నారు. పేదల సోంతింటి కలను రేవంత్ సర్కారు నెరవేరుస్తుఝదని అన్నారు. 400 ఎస్ ఎఫ్టీ నుంచి 600 ఎస్ఎఫ్టీ లోపు ఇంటి నిర్మాణం జరిగితే 4 దశలో గ్రీన్ చానల్ ద్వారా 5 లక్షల సహాయం అందుతుందని అన్నారు. బేస్మెంట్ దశలో లక్ష రూపాయల, గోడల దశలో లక్షా 25 వేల, స్లాబ్ దశలో లక్షా 75 వేలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందుతుందని అన్నారు.

ఇంటి జాగా లేని నిరు పేదలకు కూడా రెండవ దశలో ఇండ్లు తప్పకుండా ఇస్తామని, ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదని అన్నారు. గతంలో పేదలకు అసైన్మెంట్ భూముల పంపిణీ చేసింది తమ హయంలో మాత్రమేనని, గత 10 సంవత్సరాల కాలంలో అసైన్మెంట్ కమిటీలు లేవని, నేడు మరోసారి భూ భారతి లో ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో అసైన్మెంట్ కమిటీలు ఏర్పాటు చేసి నిరుపేదలకు ఇంటి స్థలాలు అందిస్తామని అన్నారు.

కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ చందుర్తి మండలంలో రెండో విడత కింద 503 లబ్ధిదారులను పారదర్శకంగా అర్హులుగా ఎంపిక చేసి నేడు ఉత్తర్వులు పంపిణీ చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు ఎంపికైన లబ్ధిదారులు వెంటనే నిర్మాణ పనులు నెల రోజుల లోపు ప్రారంభించుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో పూర్తి సహకారం ప్రభుత్వం నుంచి అందిస్తామని , నిర్మాణానికి అవసరమైన ఇసుక మండల కేంద్రాలలో అందుబాటులో పెడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పిడి హౌసింగ్ శంకర్, మండల ప్రత్యేక అధికారి రవీందర్ రెడ్డి, రుద్రంగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లేశం సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్, డైరెక్టర్లు సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులను బానిసలుగా చేస్తున్న కేంద్ర ప్రభుత్వం..

**- కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి**

**-బీఆర్టీయు జిల్లా అధ్యక్షులు వెంగళ శ్రీనివాస్**

**బలగం టీవీ, సిరిసిల్ల**



కేంద్ర బీజేపీ ప్రభుత్వ కార్మిక , ప్రజా వ్యతిరేక విధానాలు అవలాంభిస్తూ 4 లేబర్ కోడ్ తెచ్చి కార్మికులను బానిసలను చేసే విధంగా చేయాలని కుట్రలు చేస్తుందనిబీ ఆర్ టీ యు జిల్లా అధ్యక్షులు వెంగళ శ్రీనివాస్ అన్నారు.కార్మికులందరికీ కనీస వేతనం 26,000 అమలు చేయాలని తదితర డిమాండ్లతో మంగళవారం తంగళ్లపల్లిలో బీడీ కార్మికులతో కలసి ప్లకార్డులతో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఎన్నో ఏండ్లుగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను తొలగించి పెట్టుబడిదారులు , యాజమాన్యాలకు అనుకూలంగా కార్మికులను కట్టు బానిసలను చేసే కుట్ర చేస్తుందని అన్నారు.

కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశంలోని అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే 20 న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని,దేశంలో నెలకొన్న యుద్ధ వాతావరణం , కొన్ని అనివార్య కారణాల నేపథ్యంలో సార్వత్రిక సమ్మెను జూలై 9 వ తేదీకి వాయిదా వేయడం జరిగిందని అన్నారు.ఇప్పటికైనా కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను మానుకొని, కార్మికల కి వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని లేకుంటే రాబోయే రోజుల్లో కార్మిక వర్గ ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.లక్షలాది మంది ఆధారపడి జీవనోపాది పొందుతున్న బీడీ పరిశ్రమపై అనేక ఆంక్షలు పెట్టి ఈ రోజు ఉపాధి లేకుండా చేసి బీడీ పరిశ్రమను నిర్వీర్యం చేసి కార్మికులను రోడ్డుపాలు చేస్తోందని అన్నారు.జూలై 9న తలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో రాజన్న సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా సంఘటిత , అసంఘటిత అన్ని రంగాలలో పనిచేస్తున్న కార్మికులందరూ తప్పకుండా పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన విధంగా బీడీ కార్మికులందరికీ ఎటువంటి నిబంధనలు లేకుండా 4000 రూపాయల పెన్షన్ ఇవ్వాలని కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు.

# గెలుపుతో ముగించిన రాజస్థాన్



- చెన్నై సూపర్ కింగ్స్‌పై 6 వికెట్ల తేడాతో విజయం
- చెలరేగి ఆడిన వైభవ్ సూర్యవంశీ

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్ 2025 సీజన్‌ను రాజస్థాన్ రాయల్స్ విజయంతో ముగించింది. చెన్నై సూపర్ కింగ్స్‌తో ఢిల్లీ వేదికగా జరిగిన తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన రాజస్థాన్ రాయల్స్ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. బౌలింగ్‌లో ఆకాశ్ మధ్వాల్, యుధ్‌వీర్ సింగ్ రాణించగా.. బ్యాటింగ్‌లో 14 ఏళ్ల సూర్యవంశీ హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు.

ముందుగా బ్యాటింగ్ చేసిన చెన్నై సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 187 పరుగులు చేసింది. ఆయుష్ మాత్రే(20 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 43), డెవాల్డ్ బ్రెవిస్(25 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 42), శివమ్ దూబే(32 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 39) రాణించారు.రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో యుధ్‌వీర్ సింగ్(3/47) , ఆకాశ్ మధ్వాల్(3/29) మూడేసి వికెట్లు తీయగా.. తుషార్ దేశ్‌పాండే, వానిందు హసరంగా తలో వికెట్ పడగొట్టారు. మరోసారి ధోనీ జిడ్డు బ్యాటింగ్ సీఎస్‌కే భారీ స్కోర్‌ను అడ్డుకుంది.

అనంతరం రాజస్థాన్ రాయల్స్ 17.1 ఓవర్లలో 4 వికెట్లకు 188 పరుగులు చేసింది. వైభవ్ సూర్యవంశీ(33 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 57), సంజూ శాంసన్(31 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 41), ధ్రువ్ జురెల్(12 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 31 నాటౌట్), యశస్వి జైస్వాల్(19 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 36) రాణించారు. చెన్నై బౌలర్లలో రవిచంద్రన్ అశ్విన్(2/41) రెండు వికెట్లు తీయగా.. అన్షుల్ కంబోజ్, నూర్ అహ్మద్ తలో వికెట్ తీసారు.

లక్ష్యచేధనలో యశస్వి జైస్వాల్ దూకుడుగా ఆడి వేగంగా పరుగులు చేశాడు. అయితే అతన్ని అన్షుల్ కంబోజ్ క్లీన్ బౌల్డ్ చేయగా.. సంజూ శాంసన్‌తో కలిసి వైభవ్ సూర్యవంశీ చెలరేగాడు. ఈ క్రమంలో అతను 27 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరోవైపు హాఫ్ సెంచరీకి చేరువైన సంజూ శాంసన్(31 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 41)ని అశ్విన్ ఔట్ చేశాడు. అదే ఓవర్‌లో వైభవ్ సూర్యవంశీని కూడా ఔట్ చేశాడు. రియాన్ పరాగ్(3)ను నూర్ అహ్మద్ క్లీన్ బౌల్డ్ చేయడంతో మ్యాచ్ ఉత్కంఠగా మారుతుందని భావించారు. కానీ ధ్రువ్ జురెల్ విధ్వంసకర బ్యాటింగ్‌తో విజయ లాంఛనాన్ని పూర్తి చేశాడు.

# గుజరాత్‌లో ఐపీఎల్ ఫైనల్



**బలగం టీవీ, హైదరాబాద్**

2025 ఐపీఎల్ ప్లే ఆఫ్స్ వేదికలు ఖరారయ్యాయి. నాలుగు ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లకు ముల్లాన్‌పుర్, అహ్మదాబాద్ స్టేడియాలు వేదిక కానున్నాయి. ఈ మేరకు బీసీసీఐ మంగళవారం అధికారికంగా ప్రకటించింది. మే 29న జరిగే క్వాలిఫయర్ 1, మే 30న జరగనున్న ఎలిమినేటర్ మ్యాచ్‌లకు ముల్లాన్‌పుర్ మైదానం వేదిక కానుంది. అలాగే జూన్ 1న జరగనున్న క్వాలిఫయర్ 2, జూన్ 3న ఫైనల్ మ్యాచ్‌లకు అహ్మదాబాద్ స్టేడియం ఆతిథ్యమివ్వనుంది.

ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం క్వాలిఫయర్ 1, ఎలిమినేటర్ హైదరాబాద్ ఉప్పల్ స్టేడియం, క్వాలిఫయర్ 2, ఫైనల్ మ్యాచ్‌ను కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరగాల్సి ఉంది. కానీ, ఇటీవల భారత్– పాకిస్థాన్ మధ్య నెలకొన్ని టెన్షన్ వాతావరణం దృష్యా వేదికలు మారాయి.

### ఆర్సీబీ హైదరాబాద్ మ్యాచ్ వేదిక కూడా మార్పు

కాగా, మే 23న బెంగళూరు చిన్నస్వామి వేదికగా ఆర్సీబీ– సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్ జరగాల్సి ఉంది. అయితే ఈ మ్యాచ్‌కు వర్షం ముప్పు ఉంది. దీంతో ఈ మ్యాచ్‌ను లఖ్‌నవూ ఎకాన స్టేడియానికి తరలించారు.

## దిగ్వేశ్ రాఠీపై బీసీసీఐ సస్పెన్షన్

- అభిషేక్ శర్మకు 25 శాతం మ్యాచ్ ఫీజులో కోత



**బలగం టీవీ, హైదరాబాద్**

లక్నో సూపర్ జెయింట్స్ ఆటగాడు దిగ్వేశ్ రాఠీపై బీసీసీఐ ఒక మ్యాచ్ నిషేధం విధించింది. సన్ రైజర్స్ హైదరాబాద్‌తో సోమవారం జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ శర్మతో వాగ్వాదానికి దిగడమే దీనికి కారణం. వికెట్లు తీసిన అనంతరం హద్దులు దాటి సంబరాలు చేసుకున్నందుకుగాను ఇప్పటికే దిగ్వేశ్ రెండుసార్లు జరినామాకు గురయ్యాడు. ఈ సీజన్‌లో మూడోసారి ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లఘించినందుకుగాను దిగ్వేశ్ రాఠీపై బీసీసీఐ సస్పెండ్ చేసింది. మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత విధించడంతో పాటు లక్నో, గుజరాత్ జట్ల మధ్య ఈ నెల 22వ తేదీన అహ్మదాబాద్ వేదికగా జరిగే మ్యాచ్‌లో ఆడకుండా నిషేధం విధించింది. ఈ సీజన్‌లో దిగ్వేశ్ ఖాతాలో ప్రస్తుతం ఐదు డీమెరిట్ పాయింట్లు ఉన్నాయి. అలాగే సన్ రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్ అభిషేక్ శర్మపై కూడా బీసీసీఐ చర్యలు తీసుకుంది దిగ్వేశ్‌తో వివాదం నేపథ్యంలో అభిషేక్ మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించడంతో అతడి ఖాతాలో ఒక డీమెరిట్ పాయింట్‌ను వేసింది.

## ఐపీఎల్ మ్యాచ్‌లకు అదనపు సమయం పొడిగింపు

**బలగం టీవీ, హైదరాబాద్**

బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది. ఐపీఎల్ మ్యాచ్‌ల సమయాన్ని పెంచుతున్నామని బీసీసీఐ తెలిపింది. ఇప్పటివరకూ ఉన్న అదనపు సమయాన్ని మరోగంటకు పొడిగించింది. అంటే.. ఇకపై ప్రతి మ్యాచ్‌కు 120 నిమిషాలు ఎక్స్ ట్రా టైమ్ వర్తిస్తుంది. మే 20(నిన్నటి) నుంచే ఈ నిబంధన అమల్లోకి వస్తుందని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. మ్యాచ్ వేళల పొడిగింపు విషయంలో క్లాజ్ 13.7.3 ప్రకారం ఈ మార్పులు చేసినట్టు స్పష్టం చేసింది. దాంతో, వర్షం కారణంగా టాస్ ఆలస్యమైనా ఈ రెండు గంటల అదనపు సమయం కలిసి వస్తుందని ఫ్రాంచైజీలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. 'ఇంతకుముందు పరిస్థితులను బట్టి లీగ్ మ్యాచ్‌లకు గంట సమయం అదనంగా కేటాయించేవాళ్లం. ఇప్పుడు ప్లే ఆఫ్స్‌ను దృష్టిలో పెట్టుకొని మరో 60 నిమిషాల్ని చేరుస్తున్నాం. ఒకవేళ మ్యాచ్ ఆలస్యంగా ప్రారంభమైనా ఈ 120 నిమిషాలు ఆట రద్దు కాకుండా చూసేందుకు ఉపయోగపడుతాయి. మే 17న ఆర్సీబీ, కోల్‌కతా మ్యాచ్ వర్షార్పణం అయింది. తదుపరి మ్యాచ్‌లకు వర్ష సూచన ఉన్నందున ఐపీఎల్ కార్యనిర్వాహక మండలి ఈ నిర్ణయం తీసుకున్నాం. మే 20 నుంచి ఈ కొత్త నిబంధన అమల్లోకి రానుంది' అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి.




## 'వార్ 2' టీజర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**


యంగ్ టైగర్ ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఆయన బాలీవుడ్ అరంగేట్రం చేస్తున్న చిత్రం 'వార్ 2' టీజర్ విడుదలైంది. బాలీవుడ్ దర్శకుడు అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో హృతిక్ రోషన్ కథానాయకుడిగా నటిస్తుండగా.. ఎన్టీఆర్ ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. టీజర్‌లో హృతిక్ రోషన్‌తో ఆయన తలపడే సన్నివేశాలు సినిమాపై అంచనాలను పెంచేస్తున్నాయి. కైరా అద్వానీ కూడా ఈ చిత్రంలో ముఖ్య పాత్ర పోషిస్తోంది. 'వార్' చిత్రానికి ఇది సీక్వెల్ కావడంతో యాక్షన్ సన్నివేశాలు మరింత ఉత్కంఠభరితంగా ఉండబోతున్నాయని టీజర్ ద్వారా తెలుస్తోంది. ఈ సినిమా ఆగస్టు 14, 2025న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## జూన్ 13న 'రానా నాయుడు' 2

**బలగం టీవీ, హైదరాబాద్**




టాలీవుడ్ హీరోలు దగ్గుబాటి వెంకటేశ్ , రానా కాంబోలో వచ్చిన వెబ్ సిరీస్ రానా నాయుడు. అమెరికన్ హిట్ సిరీస్ రే డోనోవ్యాన్‌కు అడాప్షన్‌గా తెరకెక్కిన ఈ సిరీస్ తెలుగు, తమిళంతోపాటు వివిధ భాషల్లో విడుదలయ్యి మంచి రికార్డు వ్యూస్ సాధించిన విషయం తెలిసిందే. అయితే ఈ సిరీస్‌కు సీజన్ 2 రాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటికే రానా నాయుడు సీజన్ 2 టీజర్‌ను కూడా విడుదల చేసింది నెట్‌ఫ్లిక్స్. అయితే ఇప్పుడు తాజాగా విడుదల అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ వెబ్ సిరీస్‌ను జూన్ 13న నెట్‌ఫ్లిక్స్ వేదికగా తెలుగుతో పాటు తమిళం, మలయాళం, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు నెట్‌ఫ్లిక్స్ ప్రకటించింది. కొత్త సీజన్‌లో విలన్‌గా బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్ నటించబోతుండగా.. కరణ్ అన్షుమన్ దర్శకత్వం వహిస్తున్నాడు.



## పరేష్ రావల్‌కు అక్షయ్ కుమార్ లీగల్ నోటీస్

**బలగం టీవీ, ముంబై**

విలక్షణ నటుడు పరేష్ రావల్‌కు బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్ లీగల్ నోటసులు పంపారు. రూ.25 కోట్లు చెల్లించాలని తన లీగల్ టీమ్ ద్వారా పంపిన నోటీస్‌లో పేర్కొన్నారు. 'హేరా ఫేరి 3' షఉటింగ్ మధ్యలో ఆయన వెళ్లిపోవడంతో అక్షయ్ కుమార్ లీగల్ నోటీసులు పంపారు.అక్షయ్ కుమార్– పరేష్ రావల్– సునీల్ శెట్టి కాంబోలో వచ్చిన 'హేరా ఫేరి', 'హేరా ఫేరి–2' సినిమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. దీంతో 'హేరా ఫేరీ 3' కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. పార్ట్– 3 షూటింగ్ ఇటీవల ప్రారంభమైంది. అయితే పరేష్ రావల్ సినిమాను మధ్యలోనే వదిలేశారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన అక్షయ్ కుమార్ అతడి వల్ల భారీ నష్టం వాటిల్లిందంటూ లీగల్ నోటీసులు కూడా పంపినట్లు తెలుస్తోంది. అక్షయ్ తన నిర్మాణ సంస్థ కేప్ ఆఫ్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై 'హేరా ఫేరీ 3'ను నిర్మిస్తున్నారు. ఆ బ్యానర్ ద్వారానే పరేష్ రావల్‌కు రూ.25 కోట్ల నష్టపరిహారాన్ని డిమాండ్ చేస్తూ లీగల్ నోటీసు పంపారు.